సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం వేకువజాము నుంచే బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బారులుతీరారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ(సా॥)	సహర్ గురు(ఉ॥)
కరీంనగర్	6.27	4.39
పెద్దపల్లి	6.34	4.46
రాజన్న సిరిసిల్ల	6.34	4.46
జగిత్యాల	6.34	4.46

గరిష్టం/కనిష్టం
41.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

9 నుంచి శ్రీరామ నవరాత్రోత్సవాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 9 నుంచి 17 వరకు శ్రీరామ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. 9న ఉగాది పండుగను పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిస్తామని, పండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 15 నుంచి 17 వరకు భక్తోత్సవాలు నిర్వహిస్తామని, 17న ఉదయం 11.59 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు.

బహుజన వీరుడు పాపన్న



పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గోపా, గౌడ సంఘం సభ్యులు

సిరిసిల్లటౌన్: బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గోపా (గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్) జిల్లా కన్వీనర్ కంచర్ల అమరేందర్‌గౌడ్, అడ్వయిజరి మెంబర్ గుగ్గిళ్ల జగన్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాపన్న విగ్రహం వద్ద గోపా, గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాపన్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగుల సత్యనారాయణగౌడ్, కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, పులి లక్ష్మీపతిగౌడ్, బుర్ర నారాయణగౌడ్, గోపా ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్‌గౌడ్, పరకాల ప్రవీణ్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నాయిని బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నిర్వాకంతో కరువు'



అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆగయ్య తదితరులు

సిరిసిల్లటౌన్: హామీలిచ్చి అమలు చేయలేని కాంగ్రెస్ సర్కారుతోనే రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. అకాల వర్షాలతో పంటలు పోగొట్టుకున్న రైతులకు ఎకరాకు రూ. 25వేలు సాయం అందించాలన్నారు. జిల్లాలో రైతుల సమస్యలను వివరిస్తూ అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు.

ఓట్లు వేయలేదనే పద్మశాలీలపై కక్ష..

అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల పద్మశాలీలు, నేత కార్మికులు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయలేదనే ఆపార్టీ ప్రతినిధులు వస్త్ర పరిశ్రమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఇకనైనా ప్రభుత్వం తేరుకుని వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిలు, ఆర్డర్లు ఇవ్వాలని లేకుంటే తెగించి కొట్లాడుతామని హెచ్చరించారు. కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పోచవేని ఎల్లయ్య, ఎగుమామిడి రమణారెడ్డి, ఎండీ సత్తార్, పూర్ణచందర్, అడ్డగట్ల మురళి, రాజన్న పాల్గొన్నారు.

ఇన్‌టెక్ వెల్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్ల: జిల్లాకు తాగు నీటిని అందించే మధ్యమానేరు జలాశయంలో నీటి మట్టం తగ్గిందని, వేసవిలో నీటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటూ 'జిల్లాకు జల గండం' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. వేములవాడ మండలం రుద్రవరం శివారులోని మధ్యమానేరు జలాశయంలో నిర్మించిన ఇన్‌టెక్ వెల్‌ను భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.విజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం నీటి లభ్యత బాగానే ఉండగా, ఏప్రిల్ నెలాఖరు, మే నెలల్లో పరిస్థితిని అంచనా వేశారు. జిల్లాలో నీటి సరఫరా పరిస్థితిపై సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు. అలాగే నీటి నాణ్యతను కూడా పరిశీలించారు.

అక్రమ నగదు నిల్వలపై సమాచారమివ్వాలి

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు నిల్వలపై సమాచారం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రకటనలో కోరారు. అక్రమ నగదు, మద్యం, ఆభరణాల రవాణాపై సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అంశాలపై 18004251788 టోల్ ఫ్రీ నంబరు లేదా 040 23426201 లేదా 23426202 ల్యాండ్ లైన్ నంబర్లకు, వాట్సప్ నంబరు 86887 01400 సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

నిప్పు.. ముప్పు



ఇది జిల్లా కేంద్రంలోని 'సెస్' ప్రధాన కార్యాలయం. దీపావళి పంగడ పూట 'సెస్' సిబ్బంది ఆఫీస్ ముందు టపాసులు కాల్చారు. ఓ రాకెట్ పొరపాటున రెండో అంతస్తులోకి వెళ్లి రికార్డుల గదిలో పడింది. మంటలు చెలరేగి రికార్డులు, కంప్యూటర్లు, 'సెస్' సిబ్బంది కోసం కొనుగోలు చేసిన జాకెట్లను అంటుకున్నాయి. స్థానికులు సమాచారంతో రాత్రి వేళల్లో ఫైర్ సిబ్బంది వచ్చి నిచ్చెన సాయంతో రెండో అంతస్తులోని మంటలను అదుపులోకి తెచ్చారు. లేకుంటే ఇతర విభాగాల్లోకి మంటలు విస్తరించే ప్రమాదం ఉండేది.



ఈ ఫొటోలో మంటలు ఆర్పుతున్నది సిరిసిల్ల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో విద్యుత్ తీగలు తగిలి గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌ను మంటలు అంటుకున్నాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రం అధికారులకు సమాచారం ఇవ్వగా.. వ్యాన్‌తో వెళ్లిన సిబ్బంది మంటలు విస్తరించకుండా కట్టడి చేశారు.

ఇలా ఒకటి, రెండు కాదు.. జిల్లాలో ఏటా అజాగ్రత్త మూలంగా మంటలు అంటుకుని ఆస్తులు బుగ్గి అవుతున్నాయి.



మూలనపడిన అగ్నిమాపక వాహనం



సిరిసిల్లలోని అగ్నిమాపక కేంద్రం

గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు..		
	సిరిసిల్ల అగ్నిమాపక కేంద్రానికి వచ్చిన కాల్స్	: 45
	అగ్నిప్రమాదాలతో జరిగిన నష్టం	: రూ.51.50 లక్షలు
	రక్షించిన ఆస్తుల విలువ	: రూ.6.42 కోట్లు
	వరద సహాయక చర్యల్లో సేవలు పొందినవారు	: 120 మంది
	సిరిసిల్ల అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబరు	: 08723-232901, 87126 99258
	వేములవాడ అగ్నిమాపక కేంద్రానికి వచ్చిన కాల్స్	: 37
	అగ్ని ప్రమాదాల్లో జరిగిన నష్టం	: 15.76 లక్షలు
	రక్షించిన ఆస్తుల విలువ	: రూ.1.04 కోట్లు
	వేములవాడ అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబరు	: 08723-238101, 87126 99260

- అగ్గి రగిలితే అంతే..
- జిల్లాలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- దూరప్రాంతాలకు సకాలంలో చేరని ఫైరింజన్లు
- అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో విపత్తు స్పందన, అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. సిరిసిల్ల అగ్నిమాపక కేంద్రంలో ప్రధానమైన ఫైర్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. మరో ఆరు ఫైర్‌మెన్ పోస్టులు, ఒక్క డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. వేములవాడలో రెండు డ్రైవర్ పోస్టులు, ఆరు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో ఫైర్ స్టేషన్ల నిర్వహణ ఇబ్బంది మారింది. రేయింబవళ్లు అప్రమత్తంగా ఉండాల్సిన విపత్తు స్పందన, అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత వెక్కిరిస్తుంది.

దూరభారం.. చేరడం గగనం

సిరిసిల్ల, వేములవాడల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే.. వెళ్లి రావడం కష్టంగా ఉంది. గంభీరావుపేట మండలం శ్రీగాథలో ఏమైనా అగ్ని ప్రమాదం జరిగితే.. సిరిసిల్ల నుంచి అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు గంట సమయం పడుతుంది. సిరిసిల్ల నుంచి 38 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అదే ఇల్లంతకుంట మండలంలోని ఏ గ్రామానికి వెళ్లాలన్నా.. గంటన్నర సమయం పడుతుంది. వేములవాడ నుంచి అగ్నిమాపక వాహనం కోనరావుపేట మండలం మరిమడ్ల, రుద్రంగి మండలం మానాల వెళ్లాలంటే కనీసం గంటన్నర సమయం పడుతుంది. ఇలా దూరభారంతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో చేరడం కష్టమవుతుంది.

ఇది ప్రమాదాల కాలం..

ఎండాకాలం అంటేనే అగ్ని ప్రమాదాలు జరిగే కాలం. భానుడి భగభగకు గడ్డివాములు, ఇళ్లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతుంటాయి. అడవుల్లోనూ మంటలు చెలరేగుతాయి. దుకాణాల్లోనూ ప్రమాదాలు జరిగి ఆస్తి నష్టం జరిగే అవకాశముంటుంది. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు చూపుతో వ్యవహరిస్తే మంచిది.

తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు

- ఇళ్లలో లూజు విద్యుత్ వైర్లు లేకుండా చూడాలి. చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, టపాసులు, లైటర్లు అందుబాటులో లేకుండా చూసుకోవాలి. కాల్చిన సిగరేట్లు, బీడీలు, అగ్గిపుల్లలను పూర్తిగా ఆర్పివేయాలి.
- సిలిండర్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్ చేయాలి. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపివేయాలి. మండుతున్న స్టవులో కిరోసిన్ పోయొద్దు.
- ఇంటికి తాళం వేసి ఎక్కువ రోజులు వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి. పాడైన వైర్లను వాడొద్దు. ఎలక్ట్రికల్ సాకెట్‌లో కెపాసిటీకి తగిన ప్లగ్స్ మాత్రమే వాడాలి.

బోరున్నా.. నీరు లేదు



సిరిసిల్ల అగ్నిమాపక వాహనంలో నీరు నింపేందుకు పెద్ద బోరు లేదు. ఒక్క బోరు ఉండగా, సిబ్బంది అవసరాలకు సరిపోతున్నాయి. ట్యాంకర్లు నింపేందుకు ప్రైవేటు బోర్లపై ఆధారపడాల్సి వస్తుంది. కలెక్టరేట్ సమీపంలోని మరో బోరు వద్దకు వెళ్లి రావడం దూరభారంగా మారింది. పట్టణ పరిధిలోనే బోరు వసతి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిన్న ప్రమాదాల సంఖ్య పెరిగింది



జిల్లాలో చిన్నచిన్న అగ్ని ప్రమాదాల సంఖ్య పెరిగింది. అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు ఎదురవగానే వెంటనే సమాచారం ఇవ్వాలి. ఎక్కడ జరిగిందో స్పష్టంగా అడ్రస్‌తో కూడిన సమాచారం ఇస్తే వేగంగా ఘటనా స్థలానికి చేరుకోవడం జరుగుతుంది. సిబ్బంది ఖాళీలు భర్తీ అవుతాయి. కేటాయించబడిన సిబ్బంది శిక్షణలో ఉన్నారు. బోరు నీటి సమస్యపై మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం.

– టి.నర్సింహాచారి, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్, సిరిసిల్ల

చమత్‘కార్’ నేత

- నియోజకవర్గ స్థాయి ఐదుగురు నేతలకు ఖరీదైన కార్లు ఇచ్చారట..!
- ఎన్నికల్లో సహకారానికి ముందస్తు తాయిలాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల పండుగొస్తే ఓటర్లకే కాదు.. నేతలకూ పంట పండుతోంది. పోలింగ్ ముందు రోజు ఓటర్లకు తాయిలాలు అందిస్తే, ఆయా నియోజకవర్గ స్థాయి నేతలకు కొంచెం ముందుగానే ఖరీదైన కార్ల రూపంలో బహుమతులు అందాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఓ ప్రధాన పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తన విజయానికి సహకరించాలంటూ, పార్లమెంట్ పరిధిలోని ఐదు నియోజకవర్గాల నేతలకు ఐదు కొత్త కార్లు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు ఆ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. పైగా, వారు ఒకేసారి కార్లు కొనడం గమనార్హం. విశ్వసనీయ సమాచారం మేరకు.. మొదట్లో తన అభ్యర్థిత్వానికి సహకరించాలని విన్నవించినా పెద్దగా ప్రతిఫలం కనిపించలేదు. దీంతో వారిని మచ్చిక చేసుకునేందుకు ముందుకు ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చినట్లు తెలిసింది. అంతేకాదు, సదరు నేతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి పేర్ల మీదనే కార్లు తీసుకొని, వారి ఇళ్లకు చేర్చినట్లు సమాచారం. మున్ముందు అన్నివిధాలా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో సదరు నేతలు బెట్టువీడి ఎన్నికల్లో సహకరించేందుకు సమ్మతించారట. కొత్త కార్లకు తమతమ సొంతూళ్లలో పూజలు కూడా చేయించుకోవడం గమనార్హం. ఈ విషయం తెలిసి ద్వితీయ శ్రేణి నాయకులు సదరు నేత ఇంటి ఎదుట బారులు తీరుతున్నారట. మరి, సదరు చమత్‘కార్’ నేత వీరందరినీ ఎలా సంతృప్తి పరుస్తారన్నది ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అవిశ్వాసాన్ని ఎదుర్కొనేందుకు ఓ బడా నేత ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చిన ఘటనతో ఈ సంఘటనకు పోలికలున్నాయని పలువురు అంటున్నారు.

వేసవి సెలవుల్లో మరమ్మతులు పూర్తిచేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: వేసవి సెలవుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. జిల్లాలో 510 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 309 స్కూళ్లలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ ఆధ్వర్యంలో స్కూళ్లలో తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బ్యాంకుల్లో ఖాతాలు ఓపెన్ చేయాలని ఆదేశించారు.

శిక్షణ కేంద్రాల పరిశీలన

పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చే కేంద్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పి.గౌతమి మంగళవారం పరిశీలించారు. సిరిసిల్ల గీతానగర్ హైస్కూల్, వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.



సిరిసిల్ల గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు

పోలింగ్ విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సిబ్బందికి భోజన వసతి, సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి.గౌతమి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, టీఎస్‌ఈడబ్ల్యూడీసీ ఈఈ అనితా సింగనాథ్, డీఈవో రమేశ్‌కుమార్, సీపీవో పిబి.శ్రీనివాసచారి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, డీఆర్‌డీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'బయ్యర్- సెల్లార్' మీట్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని బీవైనగర్ షాదీఖానాలో బుధవారం ఉదయం 11 గంటలకు 'బయ్యర్–సెల్లార్' మీట్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పత్రగాట్ వస్త్రవ్యాపారులు వారికి అవసరమైన వస్త్రాల ఆర్డర్లను సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు వారికి అవసరమైన వస్త్రాలను సిరిసిల్ల లోని మ్యాక్స్ సంఘాలు, ఎస్‌ఎస్‌ఐ యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేయించేందుకు మీట్ ఏర్పాటు చేశారు. ఆసక్తి గల ఎస్‌ఎస్‌ఐ యూనిట్ల యజమానులు, మ్యాక్స్ సంఘాల ప్రతినిధులు మీట్‌లో పాల్గొని వస్త్రోత్పత్తి ఆర్డర్లు పొందే అవకాశం ఉందని జౌళిశాఖ అధికారులు వెల్లడించారు.

నిర్మాణరంగ కార్మికులపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కోటం రాజు

సిరిసిల్లటౌన్: నిర్మాణ రంగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు అన్నారు. మంగళవారం సిరిసిల్ల నెహ్రూనగర్‌లోని ఆర్‌ఎంపీ, పీఎంపీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సాధారణ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ బోర్డుకు కేటాయించిన నిధులను ప్రభుత్వాలు దారి మళ్లిస్తూ కార్మికులకు నష్టం చేస్తున్నాయన్నారు. 55ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు, సాధారణ మరణానికి రూ.3లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వమే టూవీలర్స్‌ను సబ్సిడీపై ఇవ్వాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు గురజాల శ్రీధర్, కేస భిక్షపతి, రాపెల్లి రమేశ్, నరేందర్, రాజా, ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో స్ఫూర్తి.. బల్దియా కీర్తి

- ఆస్తి పన్ను వసూళ్లలో సిరిసిల్ల నంబర్ 1
- వరుసగా నాల్గోసారి ప్రథమ స్థానం కైవసం

సిరిసిల్ల బల్దియాలో

రెసిడెన్షియల్ గృహాలు	17,561
కమర్షియల్ దుకాణాలు	2,655
ఇతరాలు	2,773

సిరిసిల్లటౌన్: ఆస్తిపన్ను వసూళ్లలో సిరిసిల్ల అగ్రగామిగా నిలిచింది. వరుసగా నాల్గోసారి రాష్ట్రంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రజలు బల్దియాకు పన్నుదన్నుగా నిలువడంతో ఈఘన కీర్తిని సాధించింది. సిరిసిల్ల బల్దియా ప్రస్తుతం అవలంబిస్తున్న పారదర్శక విధానాలు రాష్ట్రస్థాయిలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపిన వైనంపై కథనం.

కలెక్షన్స్.. అదుర్స్..

ఎమ్మెల్యే కేటీఆర్ దిశానిర్దేశంలో ఆస్తి పన్ను విషయంలో నాలుగేళ్లుగా పురపాలక సంఘం ఆదర్శంగా నిలుస్తుంది. సిరిసిల్ల పట్టణంలో మొత్తం 22,989 హౌస్ హోల్డ్స్ ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆస్తి పన్నును అధికారులు ఎప్పటిలాగే ప్రణాళికాబద్ధంగా వసూలు చేశారు. ప్రజలు సైతం ఈసారి కూడా బాధ్యతతో పన్ను చెల్లించారు. కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి నూరు శాతం వసూళ్లకు పక్కా ప్రణాళికతో ఇంటింటా తిరిగారు. పన్ను వసూళ్లలో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో సంస్థకు మరింత లాభం చేకూరింది.


పెరిగిన ఆదాయ వనరులు

దినదినం విస్తరిస్తున్న సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి బల్దియా కొత్తగా ఆదాయ వనరులు సాధించడంలో సఫలం చెందింది. పరిశుభ్ర పట్టణంగా కీర్తిపొందిన సిరిసిల్లలో వీధుల్లో చెత్త వేయడం నిషేధించారు. నిబంధన ఉల్లంఘిస్తే భారీగా జరిమానా వేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తిగా అమలు చేస్తూ.. ఉల్లంఘనులకు జరిమానాలు విధించడం, ప్రతి దుకాణం నుంచి తడి, పొడి చెత్తను సేకరించేందుకు విధిగా ఒక్కో దుకాణదారు నుంచి రూ.300 వరకు యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇక మున్సిపల్ ఆస్తులు ఆక్రమించడం అంటే రోడ్లపై టేలాలు వేయడం, వ్యాపారాలు చేయడం, ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం తదితర అంశాలపై కూడా నిత్యం దాడులు చేస్తూ ఆదాయం పెంచారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ డి.లావణ్య బల్దియాకు రెవెన్యూ పెంచేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. గతేదాది 99.40 శాతం, ఈసారి 99.52 శాతం పన్ను వసూలవడం విశేషం. 39 మంది సిబ్బంది ప్రణాళికతో 39 వార్డుల్లో 15 గ్రూపులుగా ఏర్పడి నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో మున్సిపాలిటీకి రావాల్సిన పన్ను రూ.5.60 కోట్లు వసూలు చేశారు.



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం

ప్రజలు సాధించిన ఘనత



రాష్ట్రంలోనే ఆస్తి పన్ను వసూళ్లలో సిరిసిల్ల నాల్గోసారి మొదటి స్థానంలో నిలవడం ప్రజల ఘనత. బల్దియాకు రెవెన్యూ పెరిగేలా నూతన విధానాలు అవలంబిస్తున్నాం. సిబ్బంది అంతా కలిసి నిత్యం పన్ను వసూళ్లు చేపట్టారు.

డి.లావణ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల













ఎండ జోరు.. జనం బేజారు

రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ జనాన్ని ఠారెత్తిస్తున్నాయి. బాటసారులు, వీధి వ్యాపారులు, చిన్నారులు విలవిల్లాడుతున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో 41 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.ఎండ తీవ్రతకు పెద్దలే అస్వస్థకు గురవుతున్నారు. తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేయాలని, చిన్నారులు, వృద్ధులు బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్?

సిరిసిల్లక్రైం: వేములవాడలో జరిగిన వివాదాల ఘటనలు ఇంకా పోలీసు సిబ్బందిని వెంటాడుతున్నాయి. ఇటీవల వేములవాడ టౌన్ పోలీసుస్టేషన్ నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి అటాచ్ అయిన కానిస్టేబుళ్లు అరుణ్, శంకర్, సురేశ్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ సస్పెండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వేములవాడలో ఠాణా అధికారి చెప్పారని ఆర్థికలావాదేవీలకు పాల్పడిన వివాదంలో ముందుగా ఐదుగురు కానిస్టేబుల్స్, ఐదుగురు హోంగార్డులను డీపీవోకు అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అంతటికీ కారణం అధికారి అని తేలడంతో సీఐని మల్టీజోన్ 1కు అటాచ్ చేస్తూ గత నెల 30 ఉత్తర్వులు జారీ చేశారు. ఇక సిబ్బందిలో మార్పు రావాలని మొదట అటాచ్ చేసి ఐదుగురు కానిస్టేబుళ్లకు మరో ఇద్దరిని అటాచ్ చేసినట్లు సమాచారం. మొత్తం ఏడుగురిలో ముగ్గురిని మంగళవారం సస్పెండ్ చేశారు. దీనికి తోడు ఓ మహిళ తన సమస్యను పరిష్కరించాలని ఠాణాకు వెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరించిన చందుర్తి ఎస్ఐతోపాటు కానిస్టేబుల్‌కు మెమో ఇచ్చినట్లు తెలిసింది. విధి నిర్వహణ లో నిర్లక్ష్యం చేసిన వారిపై పోలీసు బాస్ సీరి యస్‌గా క్రమశిక్షణ చర్యలకు వెళ్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రేబీస్ లక్షణాలతో యువకుడి మృతి


అరుణ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన మంకు అరుణ్(28) రేబీస్ లక్షణాలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ధర్మారం గ్రామానికి చెందిన మంకు శంకర్–వినోద దంపతులకు కుమారులు అరవింద్, అరుణ్, కూతురు అశ్విని ఉన్నారు. శంకర్ దంపతులు తమ కుమారుడు అరవింద్, కూతురుతో కలిసి నిజామాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అరుణ్ ధర్మారంలోని నాయనమ్మ సాయవ్వ వద్ద ఉంటున్నాడు. కొంతకాలం వీఆర్‌ఏగా పనిచేశాడు. ఆ వ్యవస్థ రద్దు కావడంతో ఖాళీగా ఉంటున్నాడు. నెల రోజుల క్రితం నిజామాబాద్ వెళ్లగా అరుణ్‌తోపాటు మరికొందరిపై కుక్కలు దాడి చేశాయి. దీంతో అరుణ్ స్థానికంగా చికిత్స పొందాడు. 15రోజుల తర్వాత అరుణ్ తీవ్ర అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.15 లక్షల వరకు వెచ్చించారు. అయితే, చికిత్స పొందుతున్న అరుణ్ ఆరోగ్యపరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..


శ్రీనివాస్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కొత్తగట్టు గ్రామానికి చెందిన రామగిరి శ్రీనివాస్(30) ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రామగిరి మల్లయ్య–మణెమ్మ దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్ హనుమకొండలో ఉంటూ డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాడు. సోమవారం హైదరాబాద్ వెళ్లి వస్తూ హనుమకొండలో బస్సు దిగుతుండగా మరో బస్సు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుమారుడిని మంచి ఉద్యోగంలో చూడాలనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. కొడుకు మృతితో కన్నీరుమున్నీరుగా విలపించారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: హైదరాబాద్‌లోని నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో కరీంనగర్ ఎస్సారార్ కళాశాల హిందీ విభాగం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరు ఇటీవల ‘సోషల్ మీడియాలో హిందీ భాష ఒక అధ్యయనం(వాట్సాప్, ఫేస్‌బుక్‌లకు ప్రత్యేకంగా)’ అనే అంశంపై చేసిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వరప్రసాద్ పర్యవేక్షణలో మహమ్మద్ ముజ్తబా, మహమ్మద్ ఆసిఫ్, షేక్ షర్జీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టును వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ ఎ.శ్రీనివాస్ విద్యార్థులను మంగళవారం అభినందించారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య
- భర్త రోకలి బండతో కొట్టి చంపాడన్న మృతురాలి బంధువులు
- జలపతి తండాలో ఘటన


శోభ మృతదేహం


మార్చురీ వద్ద మృతురాలి బంధువులు

చందుర్తి(వేములవాడ): అత్తింటి వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని దేవునితండా పంచాయతీ పరిధిలో జలపతి తండాలో విషాదం నింపింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లికి చెందిన శోభ (25)ను జలపతితండాకు చెందిన గుగులోతు జలంధర్‌కు ఇచ్చి, ఆరేళ్ల క్రితం పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. రెండేళ్లు వీరి దాంపత్య జీవితం ఎంతో అన్యోన్యంగా సాగింది. తర్వాత అదనపు వరకట్నం తీసుకురావాలంటూ భర్త వేధించడం మొదలు పెట్టాడు. భరించలేకపోయిన శోభ తీవ్ర మనస్తాపానికి గురై, సోమవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి, తనువు చాలించింది. మృతురాలి తల్లిదండ్రులు బానోతు శంకర్, హీరాల ఫిర్యాదు మేరకు ఆమె భర్త జలంధర్, మామ బాలు, అత్త ముని పారవ్వపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. శోభ మృతదేహానికి చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ పంచనామా చేసి, పోస్టుమార్టంకు పంపించారు. కాగా, మృతురాలికి మూడున్నరేళ్ల కుమారుడు ఉన్నాడు.

భర్తే కొట్టి చంపాడని ఆరోపణ..

సోమవారం రాత్రి గుడుంబా తాగి ఇంటికి వచ్చిన శోభ భర్త జలంధర్ ఆమెతో గొడవకు దిగి చితకబాదాడని, అంతటితో ఆగకుండా ఇంట్లో నుంచి బయటకు నెట్టివేశాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. మళ్లీ కొట్టేందుకు వస్తాడన్న భయంతో శోభ ఇంటి కి గడియ పెట్టి, పక్కనే ఉన్న గుడిసెలో తలదాచుకుందన్నారు. మూడేళ్లుగా భర్త వేధింపులతో మానసికంగా కుంగిపోయిన ఆమె అంతకుముందే పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగిందని తెలిపారు. రాత్రి ఇంటికి చేరిన శోభను భర్త ఇప్పటివరకు ఎక్కడికి పోయావంటూ రోకలి బండతో కొట్టాడన్నారు. క్రిమిసంహారక మందుతోపాటు అతను కొట్టిన దెబ్బలకు తాళలేక మృతి చెందిందని పేర్కొన్నారు.

పోలీసుల బందోబస్తు

శోభ పుట్టింటివారు, బంధువులు ఆందోళనకు దిగుతారన్న సమాచారంతో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద బందోబస్తు నిర్వహించారు. జలపతి తండాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

కల్లు తాగి ఆరుగురికి అస్వస్థత


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో మంగళవారం ఉదయం కల్లు తాగిన ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే గమనించిన తోటి స్నేహితులు వారిని వేములవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ ఎస్‌ఐ మారుతి వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు నూకలమర్రికి వెళ్లి కల్లును పరీక్షించి సీజ్ చేశారు.

ఒకరికి తీవ్ర అస్వస్థత

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూకలమర్రి గ్రామంలోని కల్లు మండువాలో పాలకుర్తి రవి వద్ద ఏడుగురు బూర్ల సురేశ్, గుగ్లోతు రాజు, సోమినేని శ్రీనివాస్, రోమాల తిరుపతి, భూక్య తిరుపతి, గుగ్లోతు రాజు, భూక్య ప్రకాష్ కల్లు తాగారు. వీరిలో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కాగా ఏడుగురితో పాటు పాలకుర్తి రవి కూడా కల్లు తాగినట్లు తెలిసింది. కానీ ఇందులో ఇద్దరికి ఎలాంటి హానీ జరగలేదు.

కల్తీ కల్లే కారణమా?

కల్లు తాగడం వల్లే ఆరుగురు అస్వస్థతకు గురి కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజూ నూకలమర్రి గ్రామంలో చాలామంది కల్లు తాగుతుంటారు. కానీ మంగళవారం ఒకే వ్యక్తి వద్ద బాధితులు కల్లు తాగడంతో అందులో ఏమైనా మత్తు పదార్థాలు కలిశాయా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేదా ఎవరైనా కుట్రతో ఏదైనా కలిపి ఉంటారనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విచారణ చేపట్టిన పోలీసులు

నూకలమర్రి ఘటనపై పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలానికి వెళ్లి కల్లు నమూనాలు సేకరించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్‌ఐ మారుతి బాధితులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా, కల్లు తాగి ఆరుగురు అస్వస్థతకు గురికావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇలాఉంటే బూర్ల సురేశ్ అన్న రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు దొరికిన అభిలాష్ తల

- డీఎన్‌ఏ టెస్ట్‌కు పంపించిన పోలీసులు


క్రేన్ సహాయంతో బావిలోకి దిగుతున్న సీఐ స్వామి, ఎస్సై చేరాలు

తిమ్మాపూర్(మానకొండూర్): గత నెల 1వ తేదీన అదృశ్యమై, అదే నెల 27న బావిలో శవమై తేలిన మంథనికి చెందిన డిప్లొమా విద్యార్థి అభిలాష్ తల ఎట్టకేలకు దొరికింది. వారం రోజుల క్రితం మొండెం మాత్రమే లభించింది. ఒంటిపై ఉన్న దుస్తులు, సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులు అతన్ని గుర్తించారు. అయితే, తల దొరక్కపోవడంతో అభిలాష్ తల్లిదండ్రులు తిమ్మాపూర్ మండలంలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం సాయంత్రం మండల కేంద్రానికి వచ్చారు. బాధితులతో మాట్లాడారు. తమకు న్యాయం చేయాలని వారు మంత్రిని వేడుకున్నారు.

మంత్రి ఆదేశాలతో గాలింపు చర్యలు

మంత్రి శ్రీధర్ బాబు వెంటనే రూరల్ ఏసీపీకి ఫోన్ చేసి, కేసు విచారణలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా విచారణ పూర్తి చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో వారు అభిలాష్ మృతదేహం లభించిన గవ్వ రవీందర్‌రెడ్డి బావిలోని నీటిని మంగళవారం మోటార్లతో తోడించారు. క్రేన్ సహాయంతో బావిలోకి దిగి, గాలింపు చర్యలు చేపట్టగా విద్యార్థి తల దొరికింది. తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎస్సై చేరాలు డీఎన్‌ఏ టెస్టుకు పంపించారు.

‘ఎస్సెస్సీ’ మూల్యాంకనం నుంచి మినహాయింపునివ్వాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల నుంచి అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈవో జనార్దన్‌రావును కలిసి, వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో ఎస్‌ఏ–2 పరీక్షల నిర్వహణ నిమిత్తం కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూసి, మిగతావారికి స్పాట్ విధులు కేటాయించాలన్నారు. 8 కిలోమీటర్ల కన్నా తక్కువ దూరంలో పనిచేస్తున్న టీచర్లకు ముందుగా స్పెషల్ అసిస్టెంట్ విధులు కేటాయించి, ఒకవేళ సరిపోకపోతే అంతకన్నా కన్న ఎక్కువ దూరంలో పని చేస్తున్నవారిని తీసుకొని, టీఏ, డీఏలు ఇవ్వాలని విన్నవించారు. ఉద్యోగ విరమణకు ఏడాదిలోపు ఉన్నవారిని, పీహెచ్‌సీ, న్యూరో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని మినహాయించాలన్నారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సీనియార్టీ ప్రకారం కాకుండా రేషియో ప్రకారం విధులు కేటాయించాలని కోరారు. కనీసం మూడేళ్ల ఎస్సెస్సీ బోధన అనుభవం లేనివారిని, రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్నవారిని తీసుకోవద్దని పేర్కొన్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సునీత, కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, కుమారస్వామి, ప్రతిభారాణి తదితరులున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి విద్యార్థి మృతి


ఉమామహేశ్ మృతదేహం

జగిత్యాల క్రైం: సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ విద్యార్థి చెరువులో మునిగి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన రొడ్డ ఉమామహేశ్(14) 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లి వచ్చి, తన ఆరుగురు మిత్రులతో కలిసి జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె చెరువులో ఈతకు వెళ్లాడు. అందరూ కలిసి ఈత కొడుతున్న సమయంలో ఉమామహేశ్ నీటిలో మునిగిపోవడంతో మిగతా వారంతా ఒడ్డుకు వచ్చి కేకలు వేశారు. మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి, గాలింపు చర్యలు చేపట్టగా ఉమామహేశ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉమామహేశ్ మృతితో నాగేంద్రనగర్ కాలనీలో విషాదం నెలకొంది. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

సిమ్స్‌లో ఇంటర్వ్యూలకు రండి

- నేటి నుంచి ఈ నెల 7వ వరకు నిర్వహణ
- 68 కాంట్రాక్టు పోస్టులు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో కొత్తగా 68 మందిని కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకునేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలుస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, వెనెరాలజీ, సైకియాట్రిస్ట్, రెస్పిరేటరీ మెడిసిన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, ఆప్తమాలజిస్ట్, ఆర్థోపెడిక్స్, ప్రసూతి మరియు గైనకాలజీ, రేడియాలజీ, అనస్తీషియా, డెంటల్, ఎమర్జెన్సీ మెడిసిన్ తదితర 22 విభాగాలకు చెందిన కోర్సుల్లో 23 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 14 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 31 మంది సీనియర్ రెసిడెంట్, ట్యూటర్, డిమోన్‌స్ట్రేటర్‌లను తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిమ్స్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎంబీబీఎస్ రిజిస్ట్రేషన్‌తోపాటు ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎంఎస్, ఎండీ, డీఎన్‌బీ డిగ్రీ, స్పెషాలిటీ డిగ్రీ రిజిస్ట్రేషన్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, పబ్లికేషన్‌ను చేరే సమయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను తిరస్కరిస్తామని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య


అరుణ్ (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లిగేట్ గ్రామానికి చెందిన ములుగుకుంట్ల అరుణ్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ కథనం ప్రకారం.. అరుణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మనస్తాపానికి గురై, మంగళవారం ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో దూకాడు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజన్న సేవలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి


కోడె మొక్కు చెల్లించుకుంటున్న వంశీచందర్‌రెడ్డి కుటుంబసభ్యులు

వేములవాడ: రాజన్న ఆలయంతోపాటు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీ చందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి రాజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాజన్న గుడి అభివృద్ధిని విస్మరించిందని, ప్రస్తుతం విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో రాజన్న ఆలయం, పట్టణం అభివృద్ధి పథంలోకి వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వేములవాడలో వ్యక్తి దారుణ హత్య

- మద్యం మత్తులో స్నేహితుడే చంపినట్లు అనుమానం


మహేశ్ (ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ , ఎస్సై

వేములవాడ: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్ (46) రెండేళ్లుగా భార్య పద్మ నుంచి దూరంగా ఉంటున్నాడు. మద్యానికి బానిసై, వేములవాడలో కూలీ పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తితో స్నేహం కుదిరి, ఇద్దరూ కలిసి తరచూ మద్యం తాగేవారు. అయితే, సోమవారం రాత్రి మద్యం తాగిన తర్వాత ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో అవతలి వ్యక్తి మహేశ్ ముఖంపై సిమెంట్ రాయితో మోది హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. యజమాని శ్రీనివాస్ మంగళవారం అద్దె వసూలుకు రావడంతో మృతి విషయం బయటపడింది. పోలీసులకు సమాచారం అందించడంతో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. అనుమానితుడిగా భావిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. మృతుడి భార్య ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆమె నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

గంజాయి మాయమవడంపై ఆగ్రహం!

- సారంగాపూర్ ఠాణాను తనిఖీ చేసిన జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్
- నిందితులను పట్టుకునేందుకు 3 బృందాల ఏర్పాటు


సారంగాపూర్ పోలీస్‌స్టేషన్

జగిత్యాలక్రైం/సారంగాపూర్: సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏడాది కాలంలో అధికారుల నిర్లక్ష్యం, అలసత్వంతో రెండు సంఘటనలు చోటుచేసుకున్నాయి. 2023 జనవరి 9న రాత్రి జగిత్యాలకు చెందిన వడ్డీ వ్యాపారి రేగొండ నరేశ్‌ను భద్రత నిమిత్తం ఠాణాలో ఉంచగా పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. తాజాగా పోలీస్‌స్టేషన్‌లో అంబులెన్స్‌లో భద్రపరిచిన గంజాయి మాయమవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సంఘటన జరిగినప్పుడు విధుల్లో ఉన్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఠాణాలో సీసీ కెమెరాలు పని చేయడం లేదని గుర్తించినట్లు తెలిసింది. ఇక్కడి నుంచి పెంబట్లలోని పెట్రోల్ బంక్ వరకు కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించడం కష్టతరంగా మారింది. ఇందుకోసం 3 బృందాలను ఏర్పాటు చేశారు. వారు అంతటా తనిఖీలు చేపట్టడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

పోలీసుల అదుపులో అనుమానితులు?

పోలీస్‌స్టేషన్‌లో గంజాయి మాయమైన ఘటనపై విచారణ వేగవంతం చేయగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు కొన్ని రోజులు ఠాణా ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరిగినట్లు సమాచారం.

11 మంది గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ రమేశ్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ రవి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గంజాయి విక్రయించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. గంజాయి విక్రయిస్తూ పట్టుబడినవారి వివరాలను గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి టూటౌన్ ఎస్సై సనత్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. న్యూమారేడుపాక చౌరస్తా వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద కిలో గంజాయి దొరికింది. నిందితులు యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్‌కు చెందిన వల్లకాటి శశికిరణ్, రామగిరి మండలం పెద్దంపేటకు చెందిన రామగిరి ఈశ్వర్‌లను అరెస్టు చేశారు. అలాగే, కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు జూలపల్లికి చెందిన అనవేణ శ్రీనివాస్, ముక్కెర పవన్, అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, అడ్డూరి దామోదర్, కొలిపాక రమేశ్, సుంకరి బాబు, చిప్పకుర్తి విష్ణు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి పోలీసులు కిలో గంజాయిని స్వాధీనం చేసుకొని, అరెస్టు చేశారు. పాలకుర్తి మండలంలోని ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, విక్రయిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. రెండు బృందాలతో గంజాయి విక్రయిస్తున్న వారిపై నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. గంజాయికి అలవాటుపడిన పిల్లల గురించి తల్లిదండ్రులు సమాచారం ఇస్తే కౌన్సెలింగ్ నిర్వహించి, వారు గంజాయి మానేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన టూటౌన్ సీఐ రవీందర్, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్‌లను అభినందించారు. టూటౌన్ రెండో సీఐ లింగమూర్తి, ఎస్సైలు వెంకటేశ్, సనత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి(ధర్మపురి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పెగడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మల్యాల సీఐ రవి సంబంధిత వివరాలు వెల్లడించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఆదిలాబాద్ జిల్లా బొప్పాపూర్‌కు చెందిన మెస్రం నగేశ్, జాకిర గూడకు చెందిన పెందుర్ లక్ష్మణ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగ్‌లో చూడగా 2.2 కిలోల గంజాయి కనిపించింది. విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నా రు. దీంతో వారిని అరెస్టు చేసి, మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితం పాడు చేసుకోవద్దని సూచించారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు నిఘా పెంచామన్నారు. గంజాయి క్రయవిక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితులను పట్టుకున్న ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై సత్తయ్య, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అతి త్వరలో బీజేపీ ప్రజా మేనిఫెస్టో

- బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్


మాట్లాడుతున్న కుమార్, పక్కన ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను సేకరించి, అతి త్వరలో బీజేపీ ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వంటి కుటుంబ పార్టీల మాదిరిగా నాలుగు గోడల మధ్య మేనిఫెస్టోను రూపొందించబోమని తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ అంశాలుండాలో రైతులను అడిగి తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్‌లోని ఎంపీ బండి సంజయ్ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోవడం వల్ల వ్యవసాయం చేయడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు యువత, రైతుల అభిప్రాయం సేకరించామని, ఈ నెల 5లోపు కార్మికులు, మహిళల అభిప్రాయ సేకరణ పూర్తి చేస్తామన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ‘అల్ఫోర్స్ సమ్మోహనం’





కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని అల్ఫోర్స్ హైస్కూల్ వార్షికోత్సవం అలరించింది. సీతారాంపూర్‌లోని శుభం గార్డెన్స్‌లో మంగళవారం ‘అల్ఫోర్స్ సమ్మోహనం’ పేరిట నిర్వహించిన వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ప్రతీ విద్యార్థి బాల్యదశ నుంచే మేధాశక్తిని పెంపొందించుకుంటూ ఎంచుకున్న రంగంలో ఉన్నతా స్థానంలో నిలవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యనభ్యసించే వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.